# వైభవంగా దుర్గామాత నిమజ్జనం


పెంబి : దుర్గామాత నిమజ్జనోత్సవంలో పాల్గొన్న భక్తులు

పెంబి, అక్టోబర్ 24: మండల కేంద్రంలో దుర్గామాత నిమజ్జనం సోమవారం వైభవంగా నిర్వహించారు. వాడవాడలో శోభాయాత్ర నిర్వహించి సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. మహిళలు, యువకులు నృత్యాలు చేశారు. అనంతరం భీమన్న చెరువులో దుర్గామాత విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. సర్పంచ్ పూర్ణచందర్ గౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ పుప్పాల శంకర్, మాజీ ఎంపీపీ సల్లా రామేశ్వర్ రెడ్డి, వీడీసీ సభ్యులు పుప్పాల నర్సయ్య, తులాల రాజలింగు, గన్నారపు సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

**దస్తురాబాద్‌లో..**

దస్తురాబాద్,అక్టోబర్ 24 : మండల కేంద్రంతో పాటు మున్యాల, రేవోజిపేట గ్రామాల్లో దుర్గామాత నిమజ్జనాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారులతో దుర్గా మాతకు స్వాగతం పలికారు. కోలలు వేస్తూ నృత్యాలను చేస్తూ, దుర్గామాతను పలు వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. చెరువుల్లో దుర్గామాతను నిమజ్జనం చేశారు. ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, గ్రామస్తులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

**ఖానాపూర్‌లో..**

ఖానాపూర్ రూరల్, అక్టోబర్ 24 : పలు గ్రామాల్లో సోమవారం రాత్రి దుర్గామాత నిమజ్జనం ఘనంగా జరిగింది. మహిళలు, భక్తులు, భక్తి పాటలు, డీజే సౌండ్స్ మధ్య విగ్రహాలు నిమజ్జనానికి తీసుకెళ్లారు. దుర్గా మాత విగ్రహాలను గోదావరి నదిలో నిమజ్జనం చేశారు.


దస్తురాబాద్ : రేవోజీపేటలో దుర్గామాతను నిమజ్జనం చేస్తున్న భక్తులు


ఖానాపూర్‌రూరల్ : దిలావర్‌పూర్‌లో దుర్గామాతను శోభాయాత్ర


ఖానాపూర్‌రూరల్ : బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్

# బాధిత కుటుంబానికి పరామర్శ

ఖానాపూర్ రూరల్, అక్టోబర్ 24 : రాజురా గ్రామానికి చెందిన ఓ బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ పరామర్శించారు. గ్రామానికి చెందిన చాకలి రాజవ్వ అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. జాన్సన్ నాయక్ వారి కుటుం బాన్ని ఓదార్చారు. చిన్నం రవి, గుమ్ముల లింగన్న, గడ్డం శ్రీనివాస్, పెద్ది రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**పాడే మోసిన జాన్సన్ నాయక్**

దస్తురాబాద్,అక్టోబర్ 24 : మండలంలోని మున్యాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త కుమారుడు రామగిరి నవీన్ ఆదివారం ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. దవాఖానలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. కాగా మంగళవారం నిర్వహించిన అంత్రక్రియాలకు ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ హాజరయ్యారు. నవీన్ మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల సందర్భంగా పాడే మోశారు. కుటుంబానికి అధైర్యపడవద్దని, బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసాను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు, యువకులు,తదితరులు ఉన్నారు.

# అసత్యప్రచారం మానుకోవాలి

భైంసాటౌన్, అక్టోబర్ 24 : బీఆర్ఎస్‌లో తాను అసంతృప్తిగా ఉన్నానని వార్తల్లో ఏ మాత్రం నిజం లేదని మీర్జాపూర్ సహకార సంఘం వైస్ చైర్మన్ చాకేటి లస్మన్న తెలిపారు. కొందరు పార్టీని వీడుతున్నామని అసత్య ప్రచారాలు చేస్తున్నారని పేర్కొన్నారు. అసత్యప్రచారాలు మానుకోవాలని సూచించారు. ఎన్నికల్లో ఎమ్మెల్యేను భారీ మెజార్టీతో గెలిపించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భూమా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మున్యాల తండాలో జమ్మి చెట్టు వద్దకు వెళ్తున్న సర్పంచ్, ,గ్రామస్తులు

# ఘనంగా దసరా వేడుకలు

దస్తురాబాద్, అక్టోబర్ 24 : ఆయా గ్రామాల్లో సోమవారం, మంగళవారం ఘనంగా ప్రజలు దసరాను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం పూట ప్రజలు వాహనాలకు ప్రత్యేక పూజలు చేయించారు. సాయంత్రం వేళలో జమ్మి గద్దె దగ్గరకు డప్పుచప్పుళ్లతో వెళ్లి శమీ (జమ్మి) చెట్టుకు ప్రత్యేక పూజలు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, గ్రామ పెద్ద మనుషులు నిర్వహిం చారు. జమ్మి ఆకులను ఒకరికొకరు పంచుకొని ఆత్మీయంగా దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గొడిసెర్యాల గోండు గూడెంలో జమ్మి చెట్టు చూట్టు ఆదివాసీ మహిళలు సంప్రదాయ పద్ధతిలో నృత్యాలు చేశారు. మండల కేంద్రంలో లక్ష్మీనరసింహ స్వామి పల్లకీని ఊరేగించారు.

# పత్తి కొనుగోళ్లు ప్రారంభం

భైంసా, అక్టోబర్, 24 : భైంసా పట్టణంలోని దసరాను పురస్కరించుకొని మంగళవారం పత్తి కొనుగోళ్లను ఓ ప్రైవేటు జిన్నింగ్ మిల్లులో ప్రారంభించారు. క్వింటాలు పత్తికి రూ. 7,011 ధరను వ్యాపారులు చెల్లించారు. ముందుగా పూజలు నిర్వహించి కొనుగోళ్లు ప్రారంభించారు.


పత్తి కొనుగోళ్లను ప్రారంభిస్తున్న వ్యాపారి

# దశాబ్దాల కల సాకారం

- వంతెన నిర్మాణంతో కష్టాలకు చెక్
- ఫ్లడ్ డ్యామేజ్ కింద రూ. 75 లక్షలు మంజూరు
- ఆదివాసీల హర్షం

దస్తురాబాద్, అక్టోబర్ 24 : అది ఒక మారుమూల ఆదిగూడెం. మండల కేంద్రానికి కూత వినిపించే దూరంలో ఆ గూడెం ఉంటుంది. గ్రామ పంచాయతీల ఏర్పాటు తర్వాత ఆకొండపేట గ్రామ పంచాయతీ పరిధిలోకి ఆ గూడెం వెళ్లింది. గోండు గూడెం గ్రామానికి వెళ్లే రహదారి గతేడాది భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. రహదారి లేక ఇబ్బందులకు గురవుతూనే ఉన్నారు. ఆదివాసీలు పడుతున్న ఇబ్బందులను మండల ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బ్రిడ్డి నిర్మాణం కోసం ఫ్లడ్ డ్యామేజ్ కింద ప్రభుత్వం రూ. 75 లక్షలు మంజూరు చేసింది. పనులను ప్రజాప్రతినిధులు ప్రారంభించడంతో ఆదివాసీ ల్లో ఆనందం వ్యక్తమవుతున్నది. దశాబ్దాల కల సాకారం కల సాకారమవుతుం డడంతో వారు సర్కారుకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.


కొట్టుకు పోయిన తాత్కాలిక వంతెన


వంతెన నిర్మాణానికి పనులను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు,నాయకులు

**చాలా ఇబ్బందులు పడ్డాం..**



నేను పుట్టాక ముందు మా గూడెం ఏర్పడింది. అప్పటి నుంచి మా గూడెంకి రావాలంటే సరైన రోడ్డు మార్గం లేదు. మా గూడెం సమీపంలోనే వాగు ఉంది. వాగుపై పైపులతో ఏర్పాటు చేసిన తాత్కాలికంగా నిర్మించిన వర్షాలు కురిసినప్పుడు కొట్టుకొని పోతుండే. రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నాం. బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉంది. **- సిడాం రాజు, ఉప సర్పంచ్(ఆకొండపేట)**

**సర్కారుకు ప్రత్యేక ధన్యావాదాలు..**



మా గూడెనికి బ్రిడ్డి మంజూరు అవుతుందని కలలో కూడా అనుకోలేదు. సర్కారుకు ప్రత్యేక ధన్యావాదాలు. రోడ్డు, బ్రిడ్డి సౌకర్యం లేక మేము పడిన బాధలు చెప్పుకోలేనివి. అత్యవసర సమయంలో దవాఖాన, ఇతర అవసరాల కోసం వెళ్లాలంటే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. మా కష్టాలను చూసి సర్కారు బ్రిడ్డి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసింది. **- సోము పటేల్, గూడెం(పటేల్)**